# విజేత




-రంకిరెడ్డి చంద్రశేఖర

## ఇది నిజంగా జరిగింది

ఆక్స్ ఫర్డ్ స్కూలు...

నగరంలో ఆ స్కూలుకి చాలామంచి పేరుంది. ప్రతీ సంవత్సరం ఏడోతరగతి పబ్లిక్ పరీక్షల్లో నూటికి నూరుశాతం ఫలితాలు సాధించడం ఆ స్కూలుకి ఆనవాయితీగా వస్తోంది. విద్యార్థుల క్రమశిక్షణకి ఆ స్కూలు పెట్టిందిపేరు. అలాగే ఆ స్కూలు నియమనిబంధనలు కూడా అంత కఠినంగా వుంటాయి. ముఖ్యంగా విద్యార్థుల చదువు సంధ్యల విషయంలో స్కూలు యాజమాన్యం చాలా స్ట్రిక్టుగా వుంటుంది. ఒకోసారి స్కూల్ రూల్స్ అండ్ రెగ్యులేషన్స్ చాలా స్ట్రిక్ట్‌గా వుండటంవల్ల విద్యార్థులు ఇబ్బందుల నెదుర్కొన్న పరిస్థితులు కూడా లేకపోలేదు.

సృజన అదే స్కూలులో పదోతరగతి చదువుతోంది. గత ఆరునెలలుగా ఆ అమ్మాయి తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో స్కూలుకి సరిగా రాలేకపోతోంది. అత్యంత తెలివైన విద్యార్థినిగా పేరుతెచ్చుకున్న సృజన ఎప్పుడూ స్కూలు ఫస్టే. ఏడో తరగతిలో జిల్లాలోనే అత్యధిక మార్కులు సంపాదించి కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు తీసుకుంది. అందేకాదు మంచి క్రీడాకారిణి కూడా. బాస్కెట్‌బాల్, వాలీబాల్, బ్యాడ్మింటన్, స్విమ్మింగ్ పోటీలలో ఎన్నోసార్లు మెడల్స్ తీసుకుంది. అటు చదువులలోనూ, ఇటు ఆటల్లోనూ అత్యంత ప్రతిభాసామార్థ్యాలు ప్రదర్శిస్తూ ఎంతో ఉజ్వల భవిష్యత్తు వున్న సృజన ఇప్పుడు మృత్యువుతో పోరాటం నిజంగా విషాదమే.

తొమ్మితో తరగతి అయ్యేంతవరకు ఆమెకు అనారోగ్యం అంటే ఏమిటో తెలీదు. కాని ఏడోతరగతి లోకి వచ్చింతర్వాత ఆమె అత్యంత ప్రమాదకరమైన క్యాన్సర్ బారినపడింది. క్యాన్సర్ చికిత్సలో భాగంగా ఆమె రెండేళ్లపాటు కీమోథెరపీ ట్రీట్‌మెంట్ తీసుకోవలసివుంది. కీమోథెరపీ ట్రీట్‌మెంట్ తీసుకొన్న కొద్దిరోజులకే ఆమె శరీరంలో విపరీతమైన మార్పులు వచ్చాయి. అత్యంత బాధాకరమైన ట్రీట్‌మెంట్‌ను భరించడం కష్టం అయినా ఆ చిన్నారి ఆధైర్య పడలేదు. ఆమె లక్ష్యం ఒక్కటే. పదోతరగతి పరీక్షలో స్టేట్‌ర్యాంకు సంపాదించాలి. స్టేట్‌ర్యాంక్ను సంపాదించాలంటే ముందు ఆరోగ్యాన్ని మెరుగు పరచుకోవాలి. అందుకే ఒకవైపు క్యాన్సర్‌తో పోరాటం, మరొకవైపు స్టేట్‌ర్యాంకు ఆమెలక్ష్యం. కేవలం 14ఏళ్ల వయసులో జీవితాన్ని ఛాలెంజ్‌గా తీసుకోవడం అంటే మాటలుకాదు.

క్యాన్సర్‌పై ఆమె పోరాటం ప్రారంభమైంది. ఒకోసారి వరసగా వారంరోజులపాటు ఆమె హాస్పిటల్‌లో వుండాల్సి వచ్చేది. ట్రీట్‌మెంట్ జరిగినంతసేపు భరించి మిగతా సమయంలో హాస్పిటల్‌లోనే క్లాస్ పుస్తకాలు తెప్పుకొని చదువుకొనేది. ఎక్కువ రోజులు ఆమె హాస్పిటల్‌లో గడపాల్సి వుండటం వల్ల చాలా పాఠాలు కోల్పోవలసి వచ్చింది. అయితే స్కూల్లో చెప్పే పాఠాలన్నీ ఆమె హాస్పిటల్‌లోనే చదువుకోవడం విశేషం. చదువుమీదు ఆమెకున్న శ్రద్ధకు డాక్టర్లు సైతం అభినందించేవారు. ట్రీట్‌మెంట్ కోర్స్‌బాగా పెరుగుతున్న కొద్దీ సృజన బాగా చిక్కిపోయింది. హాస్పిటల్‌లో అడ్మిట్‌కాకముందు ముద్దుగా, బొద్దుగా ఎంతో చలాకీగా వుండే అమ్మాయి ఇవుడు గుర్తు పట్టలేనంతగా మారిపోయింది. అత్యంత శక్తివంతమైన మందులు వాడటం కీమోథెరపీ ట్రీట్‌మెంట్ ప్రత్యేకత. పవర్‌ఫుల్ డ్రగ్స్ ఉపయోగించడంవల్ల సైడ్ ఎఫెక్ట్స్ ప్రారంభమయ్యాయి. నల్లగా నిగనిగలాడే ఆమె రింగు రింగుల జుట్టంతా ఊడిపోవడంతో తల బోడిగుండుగా మారిపోయింది. శరీరంలో రక్తం తగ్గిపోయవడంతో ఆమె మొహం అంతా పాలిపోయింది.

హాస్పిటల్ నుంచి డిశ్చార్జి అయ్యేటప్పటికి ఆమె అడుగుతీసి అడుగు కూడా వెయ్యలేకపోయేది. డిశ్చార్జి అయ్యి ఇంటికి వచ్చింతరువాత కేవలం ఒక్కరోజు విశ్రాంతి తీసుకుని ఆతర్వాత నుంచి స్కూలుకి వెళ్లిపోయేది. ఇప్పుడామె రూపురేఖలు ఎంతగా మారిపోయాయంటే తోటి స్కూలు పిల్లలు కూడా సృజనని సరిగా గుర్తు పట్టలేకపోయేవారు. ఎంతో తెలివైన విద్యార్థినిగా పేరుతెచ్చుకున్న సృజన ప్రక్కన కూర్చోవడం అంటే ఒకప్పుడు స్కూలు పిల్లలు ఎంతో గర్వంగా ఫీలయ్యేవారు. అలాంటిది ఇప్పుడు ఆమె ప్రక్కన కూర్చోవడానికే ఎవరూ ఇష్టపడటంలేదు. చాలామంది ఆమెతో మాట్లాడటం మానేసారు. కొంతమంది అసహ్యించుకుంటున్నారు కూడా. మొదట్లో తోటి పిల్లలు తనకు చేసిన అవమానానికి ఆ చిన్నారి హృదయం గాయపడ్డా వెంటనే ఆమె తేరుకుంది. ఇక ఆతర్వాత నుంచీ ఎవర్నీ పట్టించుకోవడం మానేసింది. స్కూల్లో ఆఖరి బెంచీమీద తను ఒక్కతే కూర్చుంటుంది. స్కూల్లో చెప్పిన పాఠాలు శ్రద్ధగా వినడం ఆతర్వాత ఇంటికి వచ్చి చదువుకోవడం స్కూలుకి వెళ్లినన్ని రోజులు ఆమె దినచర్య ఇదే.

ట్రీట్‌మెంట్ పెరుగుతున్న కొద్దీ ఆమె బాగా నీరసించిపోసాగింది. శరీరంలో రక్తం బాగాతగ్గిపోవడంతో రెండు మూడుసార్లు రక్తం కూడా ఎక్కించాల్సి వచ్చింది.

ఒకవైపు క్యాన్సర్ బాధ...

మరొకవైపు ట్రీట్‌మెంట్ బాధ...

అయితే నిరంతరం చదువు మీద శ్రద్ధ చూపడంవల్ల ఆమె రెండు బాధల్ని మరిచిపోయేది. చూస్తుండగానే ఫిబ్రవరి నెల వచ్చేసింది. ఇక వచ్చే నెలలో పరీక్షలనగా పిడుగులాంటి వార్తవిని సృజన తల్లడిల్లిపోయింది. అయితే ఆవార్త ఆమె వ్యాధికి సంబంధించినదికాదు. పద్నాలుగేళ్లకే ప్రాణాంతకమైన క్యాన్సర్ వ్యాధికి గురయినపుడు చికిత్సలో భాగంగా భరించశక్యంకాని కెమికల్స్‌ని శరీరంలోకి పంపినపుడు కూడా ఆమె అంతగా బాధపడలేదు.

అయితే అంతకన్నా దారుణమైన వార్తని స్కూల్ మేనేజ్‌మెంట్ వారు అందించినవుడు మాత్రం ఆమె తీవ్రనిరాశకులోనైంది. ఆమె అటెండెన్స్ మరీ తక్కువగా వుండటంవల్ల పరీక్షలు రాయడానికి ఆమెకి అర్హతలేదని స్కూలు యాజమాన్యం సృజన పేరెంట్స్‌కి కబురు అందించారు.

ప్రతి నాలుగు వారాల తర్వాత సృజన క్రమం తప్పకుండా హాస్పిటల్‌లో అడ్మిట్‌కావలసి వచ్చేది. రానురాను కీమోథెరపీ ట్రీట్‌మెంట్ కోర్సు పెరగడంతో ఆమె ఎక్కువరోజులు స్కూలు మానేయవలసి వచ్చింది. దానితో ఆమె హాజరు బాగా తగ్గిపోయింది. అసలు క్యాన్సర్ బాధని, ట్రీట్‌మెంట్ బాధని భరిస్తూ స్కూల్‌కి వెళ్లి చదువుకోవడమే పెద్దగొప్ప. నిజానికి స్కూలు మేనేజ్‌మెంట్ సైతం అభినందించాల్సిన విషయమిది. కానీ అలా జరగలేదు సరికదా అవసరమైనమేరకు హాజరు లేనందుకు పరీక్షలకు పంపించడంలేదని తెలిపినవుడు ఆ చిన్నారి మనసు తీవ్రంగా గాయపడింది. ఎన్నో ఏళ్లుగా స్కూలుతో అనుబంధం పెంచుకున్న సృజన, ఆమె కుటుంబ సభ్యులకు ఈ వార్త క్యాన్సర్ కంటే భయంకరమైనదిగా అనిపించింది. సృజన తల్లిదండ్రులు ఎంతగా నచ్చచెప్పినా స్కూలు యాజమాన్యం రూల్స్ ఎవరికైనా ఒకటేనంటూ వాళ్లమాటలు వినిపించుకోలేదు.

అమాయి క్యాన్సర్‌తో బాధపడుతోంది. ఈ సమయంలో ఆమె మనసుని గాయపరిస్తే వ్యాధి మరింతగా పెరిగే అవకాశం వుంది. దయచేసి ఆమెని పరీక్షలకి కూర్చోనివ్వండని సృజన తల్లితండ్రులు స్కూల్ మేనేజ్‌మెంట్ ముందు కన్నీరు మున్నీరుగా విలపించారు. చివరకి సృజన కుటుంబ సభ్యుల ఆక్రందనలన్నీ చెవిటి వారిముందు ఊదిన శంఖంలా అయిపోయాయి.

ఇంతకాలం క్యాన్సర్‌తో పోరాటం చేస్తున్న సృజన ఇవుడు మరోపోరాటం చేయక తప్పిందికాదు. స్కూల్ మేనేజ్‌మెంట్ మీద ఆమె తన పోరాటాన్ని ప్రారంభించింది. స్కూల్ ఎదురుగా ఆమె నిరాహారదీక్ష ప్రారంభించింది. అంతవరకూ దూరం దూరంగా అంటరానిదాన్నిలా చూసిన తోటిస్కూలు పిల్లలు కూడా ఆమెకు మద్దతు ప్రకటించడంతో విపరీతమైన ప్రతిస్పందన కనిపించింది. మరునటిరోజు దినపత్రికలన్నీ ఈ వార్తను ప్రముఖంగా ప్రచురించాయి. వెంటనే ఈ వార్త జిల్లా కలెక్టర్ దృష్టికి, జిల్లా విద్యాశాఖాదికారి దృష్టికి రావడంతో వాళ్లు వెంటనే స్పందించారు.

క్యాన్సర్‌తో పోరాటం చేస్తున్న ఆ చిన్నారి బాలిక పట్టుదల చూసి కలెక్టర్ చలించిపోయి హుటాహుటిన స్వయంగా సృజన దగ్గరకొచ్చి నిన్ను పరీక్షలకు పంపించే బాధ్యతనాది. ఇక నిరాహారదీక్ష విరమింపజేయమని నచ్చచెప్పడంతో సృజన విరమించింది. కలెక్టర్ వేంటనే విద్యాశాఖ మంత్రితో మాట్లాడటంతో సృజనను పరీక్షలకు పంపవచ్చు అంటూ విద్యాశాఖా మంత్రి స్వయంగా ఉత్తర్వులిచ్చారు. సరైన కారణం వున్నప్పుడు నిబంధనలను సవరించవచ్చు అంటూ మంత్రి స్కూల్ మేనేజ్‌మెంట్ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు.

ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రావడంతో స్కూల్ మేనేజ్‌మెంట్ తమ నిర్ణయాన్ని మార్చుకోక తప్పిందికాదు. సృజనని పరీక్షలు రాయడానికి అను మతినిచ్చినట్లు స్వయంగా ఆమె ఇంటికి లెటర్ పంపించారు. సృజనతోపాటు ఆమె తల్లిదండ్రుల ఆనందం అంతా ఇంతాకాదు. ఇక సృజన అయితే తనకి క్యాన్సర్ తగ్గిపోయినంతగా సంతోషపడిపోయింది. ఇంకా చెప్పాలంటే పరీక్షల్లో స్టేట్ ఫస్ట్ ర్యాంకు తనకే వచ్చినంతగా ఉబ్బితబ్బిబయిపోయింది.



## పాపం మగాడు

*ఓ యువతి, యువకుడు ఓ హోటల్ రూమ్‌లో గాఢంగా ప్రేమించుకుంటున్న స్థితిలో

"డియర్... మా ఆయనకు తెల్సిపోయినట్టుంది... వస్తున్నాడు... త్వరగా కిటికీలోంచి దూకెయ్.." అంది కంగారుగా.

"పదమూడో అంతస్తులో ఉన్నాం.. ఇక్కడి నుంచి ఎలా దూకడం..." భయంగా అన్నాడు అతగాడు.

"ఇక్కడ నుంచి దూకి వెళ్లిపోతేనే రేపు మళ్ళీ నిన్ను కలుస్తా... లేకపోతే గుడ్ బై...." అంది.

వెంటనే అతడు దూకేసాడు. మర్నాడు ఆమెను కలవాలన్న కోరికతో.

సరిగ్గా పరీక్షలకు వారం రోజుల ముందుగా ఆమె హాస్పిటల్‌లో అడ్మిట్ కావలసి వచ్చింద. ఇంతకుముంధు కన్నా ఎక్కువగా ఇప్పడు ఆమెకు మందులు ఎక్కిస్తున్నారు. గ్లూకోజ్ బాటిల్‌లోకి ఇంజెక్ట్ చేసిన పవర్‌ఫుల్ డ్రగ్స్ ఇంట్రావీనస్ ద్వారా ఆమె శరీరంలోకి చేరుతున్నాయి. మందు శరీరంలోకి ప్రవేసించనంత వరకు బానే వుంటుందిగాని శరీరంలోకి వెళ్లింతర్వాత దేహాన్ని దహించివేస్తుంది. కీమోథెరపీ ద్వారా ఇచ్చే కెమికల్స్ శరీరంలోకి ప్రవేహించిన తర్వాత క్యాన్సర్ కణాలపై అన్నివైపుల నుంచీ తమ దాడిని కొనసాగిస్తాయి. అయితే ఈ ట్రీట్‌మెంట్ ఎంత శక్తివంతమైనదో అంత ప్రమాదకరమైనది కూడా. ఈ ట్రీట్‌మెంట్ వల్ల క్యాన్సర్ కణాలతోపాటు చాలా ఆరోగ్యకరమైన కణాలు కూడా నశిస్తాయి. దానితో సైడ్ ఎఫెక్ట్స్ ప్రారంభమవుతుంటాయి. అత్యంత బాధాకరమైన కీమోథెరపీ ట్రీట్‌మెంట్‌ని చాలామంది పేషెంట్లు భరించలేక మధ్యలోనే వదిలి వెళ్లిపోతుంటారు. కాని సృజన అంత బాధని భరిస్తూనే పరీక్షలకు ప్రిపేర్ అవుతోంది. ఆమె ఒక చేతినుంచి ఇంట్రావీనస్ ద్వారా ట్రీట్‌మెంట్ జరుగుతుంటే మరోచేత్తో పుస్తకం పట్టుకొని ఆమె చదువుంతుంటే సృజన పట్టుదలకి, ఆమె మానసిక స్థైర్యానికి డాక్టర్లు, నర్సులు అంతా ఆశ్చర్యపోయేవారు.

ఇక పరీక్షలు రేపటినుంచి ప్రారంభం అవుతాయి అనగా ఈ రోజు ఆమె హాస్పిటల్ నుంచి డిశ్చార్జి అయ్యి ఇంటికి వచ్చింది. దేహం అంతా కెమికల్స్‌తో నిండిపోవడం వల్ల ఆమెకు ఒకటే వాంతులు...అంతకంటే భయంకరమైన నీరసం... అంత నీరసంలోనూ పుస్తకాలు చేత్తో పట్టుకుని తదేక దీక్షతో చదివి ఆమె పరీక్షలు రాసింది.

పరీక్షలు పూర్తి అయ్యాయి. సృజన అన్ని పరీక్షలకు హాజరై అన్నీ బాగా రాసింది. ఇక ఫలితాలు రెండు, మూడు రోజుల్లో ప్రకటిస్తారనగా చాలా మంది సృజన ఫలితం కోసం ఎంతో ఆతృతగా ఎదురుచూడటం విశేషం. సృజనతోపాటు ఆమె తల్లిదండ్రులు, స్కూలు యాజమాన్యం, తోటి విద్యార్థినీ విద్యార్థులు, జిల్లా కలెక్టర్, పత్రికా విలేకరులు, సృజనకి ట్రీట్‌మెంట్ చేస్తున్న డాక్టర్లు అంతా ఆమె ఫలితం కోసం ఎంతో టెన్షన్‌గా ఎదురుచూడసాగారు.

అంత భయంకరమైన వ్యాధితో పోరాడుతూ అంతకంటే నరకంలాంటి ట్రీట్‌మెంట్ తీసుకొంటూ ఆమె పరీక్షలు ఏం రాస్తుందిలే అని పెదవి విరిచిన వాళ్లు లేకపోలేదు. అయితే అలాంటి ప్రచారం ఎక్కువగా సృజనమీద కోపంతో స్కూలు యాజమాన్యం వారే చేయడం సిగ్గుపడాల్సిన విషయం. ఫలితాలు ప్రకటించారు. అందరి అంచనాలను తల్లక్రిందులు చేస్తూ సృజన స్టేట్ ఫస్ట్ ర్యాంకు సంపాదించింది. టీ.వీ, రేడియోలలో ఆమె పేరు హోరెత్తిపోయింది. దాదాపు అన్ని దినపత్రిలలో ఆమె పేరు పతాక శీర్షికలలో చోటుచేసుకుంది. పరీక్షలలో ఘన విజయం సాధించినట్లే క్యాన్సర్ మీద కూడా విజయం సాధించాలని ముఖ్యమంత్రి ఆమెను అభినందిస్తూ స్వయంగా సందేశం పంపించారు. ఎంతమంది ఆమెని అభి

నందించారో అంతూపొంతూ లేదు. అభినందనల పరంపరలో సృజన ఉక్కిరిబిక్కిరి అయిపోయింది.

ఆమెకు ప్రపంచాన్ని జయించినంత ఆనందం...

ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించినంత సంతోషం...

బహుశా క్యాన్సర్ వ్యాధి నీకు పూర్తిగా తగ్గిపోయింది అని డాక్టర్లు చెప్పినా ఆమె ఇంతగా ఆనందించి వుండేది కాదేమో...

ఆమె లక్ష్యం నెరవేరింది.

ఇక ఆమె రెండో లక్ష్యం క్యాన్సర్ మీద విజయం...

నిజానికి మనోస్థైర్యమే క్యాన్సర్ వ్యాధికిమందు. క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు ఎంత ఆనందంగా వుంటే ఆ వ్యాధి అంతగా నయంకావడానికి అవకాశాలు వుంటాయి. ఆనందంగా వుండటం వల్ల శరీరంలో రోగనిరోధకశక్తి పెరుగుతుంది. చాలా మంది క్యాన్సర్ వచ్చిందని తెలియగానే విచారంలో మునిగిపోతారు. కాని మనోధైర్యంతో ఎదుర్కొంటే క్యాన్సర్ మీద విజయం సాధించవచ్చు. పదో తరగతి పరీక్షల్లో సృజన స్టేట్‌ఫస్ట్ ర్యాంకు సంపాదించడంతో ఆమె మానసిక స్థైర్యం బాగా పెరిగింది. ఇపుడు రెట్టించిన ఉత్సాహంతో ఆమె క్యాన్సర్‌ని ఎదుర్కొంది. ఫలితం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పూర్తిఅయ్యేటప్పటికి ఆమె క్యాన్సర్ మీద విజయాన్ని సాధించింది.

అయితే పూర్తి విజయం సాధించినట్లు కాదు. ఒకసారి క్యాన్సర్ వచ్చి నయం అయిపోయిన తర్వాత ఐదేళ్ల వరకు ఆ పేషెంట్ ఆరోగ్యంగా వుంటేనే క్యాన్సర్ పూర్తిగ నయం అయినట్లు లెక్క. ఈ ఐదేళ్లలోనూ క్యాన్సర్ మరోసారి ఎప్పుడైనా రావచ్చు. అందుకే ఈ పీరియడ్‌ని 'ఫైవ్ ఇయర్ సర్వైవల్ రేట్' అంటారు. ఆ విధంగా సృజన ఐదేళ్లపాటు డాక్టర్ల అబ్జర్వేషన్‌లో వుండాలి. ఎప్పటికప్పుడు రెగ్యులర్ చెకప్ చేయించుకోవాలి.

కాలచక్రం వేగంగా తిరిగిపోయింది. కాలగర్భంలో పది వసంతాలు గడచిపోయాయి. ఆరోజు ఆ ఊళ్లో క్యాన్సర్ హాస్పిటల్ ప్రారంభోత్సవం. ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌కి ఎదురుగా కట్టిన అత్యంత అధునాతన క్యాన్సర్ హాస్పిటల్‌కి మరికొద్ది సేపట్లో ప్రారంభోత్సవం జరుగుతుంది. వ్యాపార దృక్పథంతో కాక పూర్తి సేవా దృక్పథంతో నిర్మించిన ఆ హాస్పిటల్ ఒక డాక్టర్ కలల పంట. ఆ డాక్టర్ మొన్ననే అమెరికాలోని ప్రపంచ ప్రఖ్యాత స్లోన్ కెట్టరింగ్ క్యాన్సర్ హాస్పిటల్‌లో క్యాన్సర్ మీద తన ఉన్నత శిక్షణ పూర్తిచేసుకొని తన జన్మభూమికి తిరిగి వచ్చింది.

ఎప్పుడూ మొహంలో చెరగని చిరునవ్వు...

ఎలాంటి క్యాన్సర్ పేషెంట్‌నైనా భయపడకండి! మీకు నేనున్నానంటూ ధైర్యం చెప్పే ఆత్మీయత...

వెరసి ఆమె....డాక్టర్ సృజన.

## బహుమతి కవిత

# ఎండిపోతున్న కలలు

– వేముగంటి మురళీకృష్ణ

మట్టి చెదిరిపోయి
రాళ్ళు మిగిలాయి
నీళ్ళ చుక్కలన్నీ ఆవిరైపోయి
ఎండిన ముఖం ముందుకొస్తోంది
గుడిసె చిల్లు లోంచి
ఏకాంతంగా జారుతున్న
కొన్ని వాన చినుకుల్ని
దోసిట్లో ఎలా బంధించగలం?
చుట్టూరా ఆవరించబడ్డ చీకటి
వెలుగు కళ్ళలో దుమ్ముకొట్టింది
ఇక్కడ ఏడుపొక్కటే
లయబద్దంగా సాగుతోంది
కంఠం మీద నులక తాడు వేళ్ళాడి వేళ్ళాడి
సరిగ్గ చావు దగ్గరే తెగిపోయింది
ప్లాస్టిక్ డబ్బాలోని విషం
గన్నేరు కాయల ఎసరు
నోటికి చేదుగా తాకడం లేదు
ఆత్మహత్యలు వాతావరణ ప్రేరణ కాదు
ఇప్పుడు మనిషి దుఃఖం
రెండు దారుల మధ్య నిలబడింది.
కాల్వ గట్లన్నీ కూరుకుపోయాయి
ఎండిన పొలాలన్నీ చూసి నాగలి
పనిలో దిగడానికి మొరాయిస్తోంది
అక్కడక్కడ కొలిప్రాణంతో కొట్టుకుంటున్న
గరికపోచలు పచ్చగా కనబడాలని
తలపైకెత్తి చూస్తున్నాయి
మట్టి రహస్యాల్ని శోధిస్తున్న వానపాములు
వేటగాడి చేయికందకుండా
బీటలు వారిన నేలలోనే తలదాచుకుంటున్నాయి
ఇక్కడ మనిషి కలలు
ఇంటి ముందర వేళ్లాడదీసిన
ఎండి పోయిన కంకుల్లా ఊగుతున్నాయి
మనిషిప్పుడు
పుట్టుక గురించి మట్లాడటం లేదు
భూమి గురించి మట్లాడుతున్నాడు
కృత్రిమంగా కమ్ముకుపోయిన
చీకటిని ప్రశ్నిస్తున్నాడు
మనిషిప్పుడు
ఆతృతగా నీళ్ళచెలమల్ని తోడుకోవడం కంటే ముందు
వెలుగులో తాను కోల్పోయింది వెదుక్కుంటాడు
అదీ దొరకని నాడు
ముల్లుకర్రతో పశువుల రాజ్యాన్ని
ఎలా అజమాయించాలో
మనిషికి బాగా తెలుసు (రైతుల కష్టాలు చూసి)

(ఆంధ్రజ్యోతి సచిత్రవారపత్రిక, రంజని కుందుర్తి వారు సంయుక్తంగా నిర్వహించిన 1997 కవితల పోటీలో అత్యుత్తమంగా ఎంపికై వెయ్యి రూపాయలు బహుమతి పొందిన కవిత.)